బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు సమానత్వం పట్టదు

- కులమతాలుగా విభజించి విద్వేషపు పాలన
- రాజ్యాంగాన్ని సైతం మార్చే కుట్ర
- పోరాటాలకు సిద్ధపడితేనే వారి ఆగడాలకు అడ్డుకట్ట
- ఏచూరి జయంతి సెమినార్‌లో జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్, ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రజలు సమానత్వంగా ఉండటం నచ్చదు. అందుకే కులాలుగా, మతాలుగా విభజించి విద్వేషాలు పెంపొందిస్తున్నాయి. కులాల్లోనే ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అంటూ అసమానతలు సృష్టిస్తున్నాయి. ప్రజలను విడగొట్టి దోపిడీ వర్గాలకు అనుకూల వైఖరి అవలంబిస్తున్నాయి.. రాజ్యాంగాన్ని సైతం మార్చే కుట్ర పన్నుతున్నాయి.. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు సంఘటితంగా పోరాటాలకు సిద్ధపడితేనే బిజెపి ఆగడాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది.." అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సందర్భంగా 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో సెమినార్ జరిగింది.

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. 'దోపిడీ రహిత సమాజం కోసం ఏచూరి పరితపించారు. పేద, ధనిక అనే వ్యత్యాసం చూపొద్దని రాజ్యాంగం చెబుతోంది.. అది సహించని ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బిజెపి తన సిద్ధాంతంలో భాగంగా చాతుర్వర్ణ వ్యవస్థను అమలు చేసేందుకు యత్నిస్తోంది. రాజ్యాంగాన్ని వివిధ రూపాల్లో నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. ప్రజలను సామాజికంగా, ఆర్థిక వెనుకబాటుకు గురిచేస్తోంది.. దేశంలో ఒక్క శాతం ప్రజల వద్ద 40 శాతం సంపద పోగుపడగా.. 50 శాతం మంది ప్రజలు 3 రూపాయలు పంచుకోవాల్సిన దుస్థితి కల్పించారు. ఈ అసమానతలు ఎందుకు ఉండాలి? దోపిడీ వ్యవస్థను పెంచి పోషించడంతో శ్రమకుతగ్గ ఫలితం లేకుండా పోయింది. ఇక్కడ పుట్టి ఇక్కడే జీవించే వారికి సమాన హక్కులు ఎందుకు లేవు..?' అని ప్రశ్నించారు. దీనిపై ప్రజలు తిరగబడాలన్నారు.

మోడీ అధికారంలోకి వచ్చిన 11 ఏండ్లలో దేశ వ్యాప్తంగా లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత వాసులకు 200 రోజులు పని కల్పించాలంటే 50-60 రోజులు కూడా కల్పించిన దాఖలాలు లేవన్నారు. ఉన్నత చదువులు చదివిన వారికి ఉద్యోగాల్లేవని పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు.

సెమినార్‌లో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజలు ఎన్నుకుంటేనే ప్రజాస్వామ్యం

ఒక చోట దొంగ ఓటర్లను జొప్పిస్తూ.. మరోచోట ఉన్న ఓట్లను తొలగిస్తూ మోడీ ప్రభుత్వం ఎన్నికల తీరుతెన్నులను మార్చి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని జాన్‌వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఓట్ల ద్వారా ఎన్నికవుతేనే ప్రజాస్వామ్యం మనుగడ సాగించగలదన్నారు. బీహార్‌లో తమకు వ్యతిరేకంగా ఉన్న దళితుల, మైనార్టీల, ముస్లిం, ఇతర ప్రజల ఓట్లు మొత్తం 65 లక్షలు తొలగించారని.. ఇతర చోట్ల దొంగ ఓటర్లను చేర్చుతూ ఎన్నికలకు అర్థం లేకుండా చేస్తోందని, ఎన్నికల కమిషన్ బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు శ్రామికవర్గాలను కులమతాలకతీతంగా సంఘటితం చేసి సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతున్నట్టు తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, మత సామరస్యం కోసం ఐక్య ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు మోతీరాం నాయక్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొత్త నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు రేణుక, సురేశ్‌గొండ, రవీందర్, ఖలీల్, అజయ్, అరుణ్, రాజనర్సు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

ఓట్లు, సంపద దోపిడీ

- సాగర్ ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో నీరందించాలి
- యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో సంపదను కార్పొరేట్లు, ఓట్లను పాలకులు దోచుకుంటున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను కొంతమంది దోచుకుంటున్నారని, పేద ప్రజలకు దక్కాల్సిన సంపద కార్పొరేట్ల చేతిలోకి వెళ్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాలు రాజకీయం, కార్పొరేటీకరణ అయిపోయాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆయా రాష్ట్రాల్లో తప్పుడు మార్గాల్లో అధికారాన్ని చేజిక్కించుకుంటోందని, అందులో భాగంగానే బీహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగించిందని విమర్శించారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వ సంస్థలు కీలుబొమ్మలుగా మారిపోయాయన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రజాఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణలో యూరియా కొరత తీవ్రంగా ఉందన్నారు. యూరియా సరఫరాలో కేంద్రం వివక్ష చూస్తోందని, రాష్ట్రంలో కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉందని ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో నీరు అందించాలని కోరారు. ఎడమ కాల్వ ఆయకట్టు రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. చివరి భూములకు నీరు అందే విధంగా ఎడమకాల్వకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర, నాయకులు డా.మల్లు గౌతమ్‌రెడ్డి, బావాండ్ల పాండు, రవి నాయక్, శశిధర్‌రెడ్డి, రేమిడల పరుశురాములు, తిరుపతి రామ్మూర్తి పాల్గొన్నారు.

'సంక్షేమమే సేవ' సైన్స్ లక్ష్యం కావాలి

- యువత ఆ దిశగా అడుగులు వేయాలి : ఆచార్య ప్రతాప్‌రెడ్డి
- యువత నైపుణ్యం ద్వారానే సాధికారత : బాలకిష్టారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సంక్షేమమే సేవ' సైన్స్ లక్ష్యం కావాలని, యువత ఆ దిశగా అడుగులు వేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం (కెయు) విసి తెలంగాణ సైన్స్ కాంగ్రెస్-2025 చైర్మన్ ఆచార్య కె ప్రతాప్‌రెడ్డి అన్నారు. కెయు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా కేయూ విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు జరగనున్న 'తెలంగాణ సైన్స్ కాంగ్రెస్-2025' మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ.. క్వాంటం ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంట్, ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, నూతన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అడుగుపెడుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, ఇండస్ట్రీల భాగస్వామ్యం అవసరం అన్నారు.తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆచార్య బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. యువత నైపుణ్యం ద్వారానే సాధికారత సాధిస్తుందని చెప్పారు. దేశ యువత విద్య, వైజ్ఞానిక రంగాల్లో ప్రపంచానికి పోటీ ఇస్తోందని తెలిపారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అధ్యక్షులు ఆచార్య మోహనరావు మాట్లాడుతూ.. సామాజిక పరివర్తనకు సైన్సు ఒక సాధనం అన్నారు. విద్యార్థులు క్రిటికల్ థింకింగ్ నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు. కోవిడ్‌తో మన శాస్త్ర పరిజ్ఞానం ప్రపంచానికి తెలిసిందన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం 50సంవత్సరంలోకి అడుగుపెట్టిందని, అనేకమంది గొప్ప వ్యక్తులను కేయూ అందించిందని చెప్పారు. ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాని పివి.నరసింహారావు కూడా కుయు పూర్వ విద్యార్థి అని గుర్తు చేశారు. తాను కూడా ఈ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థినే అని చెప్పారు.డిఆర్‌డిఒ పూర్వపు చైర్మన్, భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైసర్ డాక్టర్ జి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఇన్నోవేటివ్ స్కిల్స్ ఫర్ ఎంపవర్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ యంగ్ ఇండియా" థీమ్‌తో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు, యువత ఆవిష్కరణలు దేశానికి ఆదర్శం అన్నారు. 2016లో 458 స్టార్టప్స్ ఉంటే.. ప్రస్తుతం 1.75 మిలియన్ స్టార్టప్స్ వచ్చాయని, ఇది విప్లవాత్మక మార్పు అన్నారు. గ్రామీణ నేపథ్యం, కుటుంబ నేపథ్యం అనేది ముఖ్యం కాదు.. ఆలోచనా సరళి ముఖ్యం అన్నారు. ప్రపంచ సాంకేతికతతో పోటీ పడే మనస్తత్వం, ఆవిష్కరణలో కొత్తదనం, ఎఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం టెక్నాలజీ లాంటి ఏరియాలు అధ్యయనం, పరిశోధన తత్వం యువతలో రావాలని సూచించారు. ప్రపంచానికి భారత్ అవసరం ఉంది అన్నారు.

రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రం మాట్లాడుతూ.. మూడ్రోజుల తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు సహకరించిన సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య బి వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ.. ఈ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించడం గర్వకారణమని అన్నారు. అనంతరం తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ అబ్‌స్ట్రాక్ట్‌ను విడుదల చేశారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేపల వేటకు వెళ్లి ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లాలోని భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాజ్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ జహంగీర్ (52), భువనగిరి పట్టణానికి చెందిన వెంకటేష్ (48) చిన్నేటి వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. వల వేసి చేపలు పట్టేందుకు ప్రయత్నిస్తుండగా వరద ఉధృతి కారణంగా ప్రమాదవశాత్తు జహంగీర్ వాగులో పడిపోయాడు. ఆయనను కాపాడేందుకు యత్నించి వెంకటేష్ కూడా వరదలో పడిపోయి.. ఇద్దరూ మృతిచెందారు. స్థానికులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ సేవల్లో తెలంగాణ అగ్రగామి

- 73 శాతం లబ్ధిదారులకు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా టేక్ హోం రేషన్
- కేంద్ర పోషణ్ ట్రాకర్‌లో వెల్లడి : సిబ్బందిని అభినందించిన మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ సేవల్లో తెలంగాణ మరో ముందడుగు వేసింది. లబ్ధిదారులకు పారదర్శకతతో పోషకాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్)ను సమగ్రంగా అనుసంధానం చేసింది. అంగన్‌వాడీ సిబ్బంది లబ్ధిదారుల వివరాలను మొదటిసారి నమోదు సమయంలో ఈకేవైసీ, లైవ్ ఫొటో క్యాప్చర్ ద్వారా నమోదు చేస్తున్నారు. ఆ తర్వాత ప్రతి నెలా టేక్ హోం రేషన్ (టిహెచ్‌ఆర్) పంపిణీలో ఫేస్ మ్యాచింగ్ ప్రక్రియను అనుసరించి సరైన లబ్ధిదారునికే సరుకులు అందజేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో మొత్తం 18,59,978 మంది టేక్ హోమ్ రేషన్ లబ్ధిదారులున్నారు. అందులో 74.32 శాతం మందికి ఇప్పటికే ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా పోషకాహారం పంపిణీ జరుగుతోందని కేంద్ర పోషన్ ట్రాకర్‌లో వెల్లడైంది. ఈ విధానంతో పాలు, గుడ్లు, బాలామృతం వంటి పోషకాహార సరుకులు దారి మళ్లింపులు లేకుండా నేరుగా లబ్ధిదారుల చేతికి చేరుతున్నాయి. మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) వరుస సమీక్షలతో ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు శాతం గణనీయంగా పెరుగుతోంది. దాన్ని ఇంకా విస్తరించి 90 శాతం కవరేజ్ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఆ దిశగా అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, సాంకేతిక వనరులను మరింతగా వినియోగించేందుకు చర్యలు ప్రారంభించింది. రాబోయే నెలల్లో మరింత మంది లబ్ధిదారులు ఈ వ్యవస్థలో నమోదు కాబోతున్నారు.

సిబ్బందికి మంత్రి సీతక్క అభినందనలు

ఫేస్ రికగ్నిషన్ ద్వారా లబ్ధిదారులకే నేరుగా సరుకులు అందుతున్నాయని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. ఈ విజయానికి కారకులైన మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందిని, అంగన్‌వాడీలను అభినందించారు. 'ఫేస్ రికగ్నిషన్ సిస్టం వలన లబ్ధిదారులకే సరుకులు అందుతున్నాయి. ఇది పోషకాహారం పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చింది. తెలంగాణ ఈ విషయంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. మా లక్ష్యం 90 శాతం కంటే ఎక్కువ నమోదు సాధించడం. ప్రతి చిన్నారికి, ప్రతి తల్లికి సరైన సమయానికి పోషకాహారం చేరేలా ప్రభుత్వం చేపట్టిన చర్యలు సానుకూల ఫలితాలనిస్తున్నాయి" అని పేర్కొన్నారు.

కేయెన్స్‌పై కెటిఆర్ అవాస్తవాలు ప్రచారం

- ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్ బ్యూరో : కేయెన్స్ సెమీ కండక్టర్ పరిశ్రమ గుజరాత్‌కు తరలిపోవడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆరోపించారు. కేయెన్స్ ఇక్కడి నుంచి వెళ్లిపోయింది అనడం కంటే.. కేంద్రం, గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వాలు భారీ సబ్సిడీలు కుమ్మరించి లాక్కుపోయాయని చెప్పడం సబబుగా ఉంటుందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ద్వారా 50 శాతం సబ్సిడితో పాటు గుజరాత్ ఇచ్చే 40 శాతం సబ్సీడీ అందించడంతో సదరు కంపెనీ గుజరాత్ బాట పట్టిందని అన్నారు. బిజెపి సర్కార్ తమ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మాత్రమే సెమికండక్టర్ ప్రాజెక్టులకు అనుమతులిస్తున్నాయని ఆరోపించారు.

మార్వాడీ గో బ్యాక్ నినాదం సరికాదు : విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్వాడీ గో బ్యాక్ నినాదం సరైన నినాదం కాదని కాంగ్రెస్ మాజీ ఎంపి వి హనుమంతరావు అభిప్రాయపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తరతరాలుగా మార్వాడీలు తెలంగాణలో ఉంటున్నారని గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధి జరుగుతుండటంతో ఇతర రాష్ట్రాల నుంచి చాలా మంది వస్తున్నారని తెలిపారు. ఇలాంటి నినాదాలతో అభివృద్ధి కుంటు పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే.. తప్పకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రానికి యూరియా సరఫరాలో కేంద్రం వివక్ష

- ఎక్స్‌లో సిఎం రేవంత్ విమర్శలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు కేంద్రం యూరియా సరఫరా చేయకుండా ప్రధాని మోడీ అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ఆరోపించారు. "రాష్ట్ర రైతాంగ అవసరాల మేరకు యూరియా సరఫరా చేయాలని లేఖల రూపంలో, విజ్ఞప్తుల రూపంలో పదే పదే కోరినా కేంద్రం స్పందించకపోవడం దారుణం. రైతాంగానికి అండగా నిలవాల్సిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మోడీ భజనలో బిజీగా ఉన్నారు. మన రైతుల కోసం.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మాతో కలిసి రావాల్సిన బిఆర్ఎస్ ఎంపిలు పార్లమెంట్‌లో పత్తా లేరు. గల్లీలో లొల్లి చేయడానికి ఉత్సాహం చూపే బిఆర్ఎస్, ఢిల్లీలో మోడీని ప్రశ్నించడానికి ఎందుకు భయపడుతోంది. మోడీ అంటే భయమా? భక్తా" అని సిఎం నిలదీశారు. రాష్ట్ర రైతాంగానికి అవసరమైన యూరియా సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని పార్లమెంట్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఎంపిలు ఎండగట్టారని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో గొంతు కలిపి పార్లమెంట్‌లో రైతుల పక్షాన నిలిచిన ఎంపి ప్రియాంకగాంధీకి సిఎం ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యుత్ షాక్ ఘటనను సుమోటోగా స్వీకరించిన హెచ్‌ఆర్‌సి

- సెప్టెంబర్ 22 నాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ రామంతపూర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి శోభ యాత్రలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది తీవ్రంగా గాయపడిన విషాదకరమైన విద్యుత్ షాక్ సంఘటనను తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ మేరకు మంగళవారం కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ సంఘటనకు గల కారణం, అధికారుల జవాబుదారీతనం, తక్షణ పరిష్కార చర్యలు, బాధిత కుటుంబాలకు పరిహారం, పునరావాసం, దీర్ఘకాలిక నివారణ భద్రతా చర్యలను కవర్ చేస్తూ సమగ్ర నివేదికను సెప్టెంబర్ 22 నాటికి సమర్పించాలని టిఎస్-ఎస్‌పిడిసిఎల్ సిఎండిని ఆదేశించారు.

కార్మికుల సమ్మెతో దిగొచ్చిన 'రాంకీ'

- సిఐటియు నేతలతో చర్చలు సఫలం
- 22న తుది ఒప్పందానికి అంగీకారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలో రాంకీ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని గత కొంత కాలంగా హెచ్‌ఐఎంఎస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్న విషయం తెలిసిందే. ఆ సంస్థ యాజమాన్యం మొండిగా వ్యవహరించడంతో చట్టబద్ధంగానే సోమవారం నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఏడు గంటల పాటు వేలాది మంది కార్మికులతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ముసురులోనూ వీడని పట్టుదలతో కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు. 'యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరి నశించాలి'.. 'పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి'.. 'రోగాలు రొప్పులతో మేము..సుఖ, సంతోషాలతో మీరు'..'కుళ్లిన చెత్తలో మేము..ఏసీ బంగ్లాలో మీరు'అంటూ పెద్దపెట్టున నినదించారు. ఒప్పందం జరిగే వరకు కదలబోమంటూ కార్మికులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో కార్మిక శాఖ అధికారులు యాజమాన్యాన్ని పిలిపించి, యూనియన్ నేతలతో చర్చలు జరిగేందుకు కృషి చేశారు. వేతన ఒప్పందం చేసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటూ హెచ్చరించారు.

దిగొచ్చిన యాజమాన్యం

ఈ నేపథ్యంలో ఎట్టకేలకు రాంకీ సంస్థ యాజమాన్యం దిగొచ్చింది. జెసిఎల్ సమక్షంలో యూనియన్ నేతలతో చర్చలు జరిపింది. చర్చలు సానుకూలంగా జరిగాయి. దీంతో ప్రస్తుతం పొందుతున్న వేతనంపై అదనంగా గ్రేడ్ కార్మికులకు రూ. 6,500లు, గ్రేడ్ రెండు కార్మికులకు రూ.6,300, అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ. ఐదువేలు చొప్పున పెంచేందుకు యాజమాన్యం అంగీకరించింది. తుది చర్చలు జెసిఎల్ సమక్షంలో ఈ నెల 22న నిర్వహించి, ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్టు యూనియన్ అధ్యక్షులు పాలడుగు భాస్కర్ వెల్లడించారు. చర్చలలో భాస్కర్‌తోపాటు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ కార్యదర్శి వీఎస్‌రావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, సిఐటియు మెడ్చేల్ జిల్లా కార్యదర్శి జె చంద్రశేఖర్, అధ్యక్షులు ఎ అశోక్, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఐ రమేష్, నాయకులు కుమారస్వామి, ఎన్ సతీష్, డి శ్యాంరాజ్, జి మస్తాన్, బి రవీందర్, వై వెంకటేశ్వర్లు, బి శ్రీనివాస్, జె భాస్కర్, వి రాజేశ్, ఎస్ యాదగిరి పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున కదిలిన కార్మికులు..

అంతకు ముందు కార్మిక శాఖ కార్యాలయం ముందు నిర్వహించతలపెట్టిన ధర్నాకు కార్మికులు పెద్ద ఎత్తున కదిలారు. నాయకుల ఉపన్యాసాలు సాగినంత సేపు..శ్రద్ధగా విన్నారు. మధ్య, మధ్యలో చప్పట్లు, నినాదాలు చేశారు. ధర్నాను ఉద్దేశించి హెచ్‌ఐఎంఎస్ డబ్ల్యుసి అండ్ టి ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ కార్మికుల రెక్కల కష్టంతోనే ఏ యజమాన్యమైనా లాభాలను దండుకుంటుందని చెప్పారు. రాంకీ సంస్థలో పనిచేసే డ్రైవర్ల కు హెల్పర్లకు వేతన ఒప్పందం చేయాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించిందని గుర్తు చేశారు.

18 నెల్ల క్రితమే యజమాన్యానికి సిఒడి ఇచ్చామని తెలిపారు. అయినా కార్మికుల డిమాండ్లను పరిష్కరించకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. ఇలాంటి మొండి వైఖరికి నిరసనగానే చట్టబద్ధంగా సమ్మెకు పోవాల్సి వచ్చిందని తెలిపారు. డంపింగ్ యార్డ్‌లలో 42సైట్లలో ఎక్కడ కూడా కార్మికులకు మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మంచినీళ్లు, మూత్రశాలలు కూడా లేవన్నారు. కుళ్లిన చెత్తతో నిరంతరం పనిచేయటం మూలంగా రోగాల భారిన పడుతున్నారనీ, కొందరు మృత్యువాతకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలను యాజమాన్యం పట్టించుకోవటం లేదని వాపోయారు. యాజమాన్యానికి తొత్తుగా బిఎంఎస్ వ్యవహరిస్తున్నదనీ, కార్మికుల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నదని చెప్పారు. బిజెపికి సంబంధించిన ఎంపిలు, ఎమ్మెల్యేలు కూడా బీఎంఎస్‌లాగా వ్యవహరించకుండా జోక్యం చేసుకోవాలని సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ స్పందించి కార్మికులను న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ కార్యదర్శి వీఎస్ రావు మాట్లాడుతూ కార్మికులు కోరేవి గొంతెమ్మ కోర్కెలు కావన్నారు. కార్మికుల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత యాజమాన్యానిదేనన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రవాణా రంగాన్ని ప్రయివేటు పరం చేస్తున్నదని చెప్పారు. రవాణా రంగంలో పనిచేస్తున్న వారికి సామాజిక భద్రతా పథకాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెరగకపోతే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ మాత్రం ఆలోచన యాజమాన్యం చేయకపోవటం వల్లనే కార్మికులు ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడ్డదన్నారు.

ఫొటోలు అబద్ధం చెప్పవు ... మౌన సాక్ష్యాలు

- కె పద్మనాభయ్య

ప్రజాశక్తి - కల్చరల్

ఫొటోలు అబద్ధం చెప్పవనీ మౌన సాక్ష్యాలు అని కేంద్ర హోమ్ శాఖ పూర్వ ముఖ్య కార్యదర్శి పద్మభూషణ్ కె పద్మనాభయ్య అన్నారు. కేశవులు సునిశిత పరిశీలన ,అవగాహన తో గొప్ప ఫొటోలను అందించారు అని ప్రశంసించారు. రవీంద్ర భారతి సమావేశ మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని సృజన భారతి సాంస్కృతిక సంస్థ నిర్వహణలో డాక్టర్ సత్యవోలు సుందర సాయి కేశవులు వార్త ఛాయా చిత్రాలు పై రచించిన మౌన సాక్ష్యాలు గ్రంథం ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పద్మనాభయ్య పాల్గొని గ్రంథ ఆవిష్కరణ చేసి మాట్లాడారు. చిన్న చిన్న అంశాలు కూడా లోతైన అధ్యయనం చేసి తన కెమెరా కన్ను లో బంధించి సంచలనం సృష్టించగల మౌన ముని కేశవులు అన్నారు. ఆయన ఫోటోలు పేదరికాన్ని అద్దం పట్టి చూపుతాయి అని వివరించారు. ప్రపంచ స్థాయిలో నిలువ గల ఫోటోలు కేశవులు తీసారు అని అమెరికా దేశంలో ఉంటే పులిజార్జ్ అవార్డుకు ఎంపిక అయ్యేవి అని చెప్పారు. అధ్యక్షత వహించి సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ మాట్లాడుతూ సత్యవోలు సుందర సాయి తన అక్షరాలతో కేశవులను అక్షర విగ్రహంగా చెక్కేరు అని కొనియాడారు. కేశవులు సుందర సాయిల నలభై ఏళ్ల మైత్రీ బంధానికి మౌన సాక్ష్యాలు గ్రంథం ప్రతి రూపం అన్నారు. కేశవులుపై గ్రంథం రాయడంతో ఫోటూ జర్నలిస్టుల కృషికి గుర్తింపు లభించినట్లు అన్నారు. పత్రికా దిగ్గజం రామోజీ రావు కేశవులు లేని ఈనాడును అనుకోగలమా అని చెప్పడంలో కేశవులుకు అంతకు మించిన అవార్డ్ లేదని చెప్పారు. ఈనాడు ఆంధ్ర ప్రదేశ్ సంపాదకుడు ఎం నాగేశ్వరరావు మాట్లాడుతూ పత్రికల కోసం పని చేసే వారు ఫోటో జర్నలిస్ట్ లు అన్నారు కేశవులు ఈనాడు సంస్థలో 43 సంవత్సరాలు వృతి పట్ల నిబద్ధతతో పని చేసి ఎన్నో అద్భుత మైన ఛాయా చిత్రాలు అందించారని చెప్పారు. వార్త కథనం చెప్పలేనిది ఫొటో కథనం లేదా కార్టూన్ సులువుగా సూటిగా చెప్ప గలవు అన్నారు. ఫోటో జర్నలిస్టులు కేశవులు వలె ప్రాధాన్యత ఇచ్చే ఫొటోల్ని పరిశీలించి తీయాలి అని సూచించారు ఈనాడులో కార్టూనిస్ట్ శ్రీధర్ కేశవులు వంటి వారు సాధారణ స్థాయి నుండి అసాధారణ స్థాయికి ఎదిగారని చెప్పారు. వేదిక పై జర్నలిస్ట్ శంకర నారాయణ కార్టూనిస్ట్ శ్రీధర్ రసమయి డాక్టర్ రాము తదితరులు పాల్గొనగా కేశవులు గ్రంధ రచయిత సుందర సాయి దంపతులను సత్కరించేరు సంస్థ స్థాపకుడు కొమ్మూరి ప్రసాద్ స్వాగతం పలికారు.

'గాంధీ'లో సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- త్వరలో ప్రత్యేక అధికారి నియామకం
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ
- గాంధీ ఆస్పత్రిలో తనిఖీ.. సమస్యలపై ఆరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని, త్వరలో ప్రత్యేకాధికారిని నియమించనున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ తెలిపారు. మంగళవారం మంత్రి గాంధీ ఆస్పత్రిని సందర్శించారు. ఓపీ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తుల్లో ఉన్న అన్ని విభాగాల్లోనూ కలియ తిరిగారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఓపీ వార్డు వెనుక ఉన్న మదర్ అండ్ చైల్డ్ సెంటర్ (ఎంసిహెచ్) బిల్డింగ్‌లోని ఐదో అంతస్థుకు వెళ్లారు. ఐవిఎఫ్ సేవల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంఖ్య పెంచాలని, ప్రయివేటు ఐవీఎఫ్ సెంటర్లతో పోటీ పడేలా కృషి ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని ఆయా విభాగాల వైద్యాధికారులతో దాదాపు రెండు గంటలపాటు సమావేశమయ్యారు. ఇటీవల వరుసగా మీడియాలో గాంధీ ఆస్పత్రిపై వచ్చిన కథనాలు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. గాంధీ ఆస్పత్రిలో సమస్యల అధ్యయనం, వాటి పరిష్కారానికి త్వరలో ప్రత్యేకాధికారిని నియమించనున్నట్టు తెలిపారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు, విద్యుత్ సమస్యలు, మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్, డ్రయినేజీ, విద్యుత్ సమస్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్టు చెప్పారు. మాడ్యులర్ ఈక్విప్‌మెంట్ ఏర్పాటుపై కమిటీ ఏర్పాటు చేశామని, ఆ కమిటీయే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఆస్పత్రిలో బెడ్ల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తామన్నారు. గాంధీ ఆస్పత్రిలో ఐవీఎఫ్ విజయవంతంగా పని చేస్తోందన్నారు.

IN THE COURT OF THE HON'BLE VI ADDL. JUNIOR CIVIL JUDGE R.R.DISTRICT :: AT L.B.NAGAR
O.S.No. 605 of 2025

Between:-
Mandadi Madhusudhan Reddy & another
...Plaintiffs
And
1. The Tahsildar, Saroornagar Mandal,
2. To whomsoever it may concerned
... Defendants

To
All Concerned,
Please take notice that the above named Plaintiffs filed the above O.S. to declare them as Legal Heirs of late Smt.Mandadi Laxmamma who died on 26-01-2020 and the matter is posted to 02-09-2025 for appearance and objections, if any, as such if any person/s is/are having any objections, they may appear before this Hon'ble Court on **02-09-2025** at **10-30** A.M. either in person or through an Advocate, duly instructed by you, failing which the matter will be decided on merits.
// By order of the Court //
I. SRIDHAR
Advocate
9-33/44, 3 rd Floor, Lingala Complex,Dilsukhnagar, Hyderabad-60,Cell : 9951018275.

భూములు తీసుకొని జీవం తీస్తారా..?

- మూడు పంటలు పండే భూములు గుంజుకుంటే ఎలా?
- బలవంతపు భూసేకరణ జరిపితే న్యాయ పోరాటానికి సిద్ధం
- మళ్లీ నిమ్జ్ భూసేకరణపై రైతుల ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారిశ్రామిక రంగం విస్తరణలో భాగంగా నిమ్జ్ పేరుతో భూములు తీసుకుని రెండు సంవత్సరాలు తిరగకముందే మళ్లీ భూసేకరణకు నోటిఫికేషన్ జారీ అయింది. ఉన్న కొద్దిపాటి భూములనూ సేకరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.. జీవం పోస్తున్న ఆ కొద్ది భూములను తీసుకుంటే తాము బతికేదెట్టా? అని రైతులు లబోదిబోమంటున్నారు. ఆ ప్రాంతాలను 'ప్రజాశక్తి' సందర్శించినప్పుడు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

దేశవ్యాప్తంగా స్పెషల్ ఎకనామిక్ జోన్(సెజ్)లను ఏర్పాటు చేసి దేశీయ ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2014లో తీసుకొచ్చిన నూతన విధానమే నిమ్జ్ (జాతీయ పెట్టుబడుల ఉత్పాదకమండలి). సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో నిమ్జ్ ప్రాజెక్టు ఏర్పాటుకు 12630 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, పట్టా భూములను సేకరించాలని గత ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటి వరకు రెండు మండలాల్లో కలిపి సుమారు 7000 ఎకరాల భూమి సేకరించింది. ఉన్న కొద్ది భూమితో బతుకుతున్న దశలో రెండు సంవత్సరాలు తిరగకముందే మళ్లీ భూసేకరణ పేరుతో ఆ భూమిని కూడా గుంజుకోవడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఎల్గోయి గ్రామంలో సాగు యోగ్యత కలిగిన భూమి 2544 ఎకరాలు ఉండగా.. 1002 ఎకరాల ప్రభుత్వ భూమి కలదు. ఇప్పటి వరకు పట్టా, ప్రభుత్వ భూములు 2000 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఇప్పటి వరకు రైతులు నిమ్జ్ ప్రాజెక్ట్ కోసం భూములు స్వచ్ఛందంగానే ఇచ్చారు. కానీ మళ్లీ భూ సేకరణకు రంగం సిద్ధమవ్వడంతో ఆందోళన చెందుతున్నారు.

మూడు పంటలు పండే భూములు..

ఉన్న కొద్దిపాటి భూముల్లో ప్రతి ఏడాదీ మూడు పంటలు పండిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఈ భూములు సైతం ప్రాజెక్ట్ పేరుతో తీసుకుంటే ఎలా అని ఎల్గోయి గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నిమ్జ్ డీపీఆర్‌లో గతంలోనే మరో 571 ఎకరాల భూసేకరణకు ఏర్పాటు చేయగా.. విషయం తెలిసిన వెంటనే రైతులు అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని కలిసి మూడు పంటలు పండే ఈ భూములు తీసుకోవద్దని వేడుకున్నారు. ప్రస్తుతం అందులోనే మరో 195.13 ఎకరాల భూమిని సేకరించడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేశారు. బలవంతపు భూసేకరణ జరిపితే న్యాయ పోరాటానికి సిద్ధమని రైతులు స్పష్టం చేస్తున్నారు.

అస్తిత్వమే కోల్పోయే ప్రమాదం

నిమ్జ్ ప్రాజెక్టు పేరుతో గ్రామంలో మొత్తం భూమిని సేకరిస్తే గ్రామం అస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. చెట్టుకొకరు పుట్టకొకరు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అది ఊహించుకుంటేనే భయమేస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

బలవంతపు భూసేకరణ చేయొద్దు..
రాంచందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

బలవంతపు భూసేకరణ ఆపాలి. లేనిపక్షంలో ఎల్గోయి రైతుల తరపున పోరాటానికి సిద్దంగా ఉన్నాం. ఇప్పటికే 2000 ఎకరాల భూమిని సేకరించారు. అందులోనే కొందరికి ఇంకా పరిహారం ఇవ్వలేదు. వారందరికీ వెంటనే పరిహారం చెల్లించాలి. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వమూ వ్యవహరిస్తోంది. బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు భూములు కోల్పోయారు. వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న కూలీలకు ఇప్పటి వరకు పరిహారం అందించలేదు. పునరావాసం కల్పించలేదు.

పూలు పండించి కుటుంబాన్ని పోషిస్తున్న
రైతు ఖైరాత్ అలి, ఎల్గోయి

ఎకరా భూమిలో లిల్లీ పూలు సాగు చేసి జహీరాబాద్ పట్టణంలో అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. నిమ్జ్ ప్రాజెక్టు కింద నా భూమిని సేకరిస్తామని నోటిఫికేషన్ ఇచ్చారు. భూమిని కూల్పోతే మా కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి. గతంలోనే మూడెకరాల భూమిని ప్రభుత్వం తీసేసుకుంది. మళ్లీ ఈ మిగిలిన భూమి తీసుకుంటే మా పిల్లల భవిష్యత్ ఏమిటి?

మూడు పంటలు పండే భూములు - యూనుసొద్దీన్

సంవత్సరానికి మూడు పంటలు పండే భూములను మేము వదులుకోం. అల్లం, పసుపు, చెరుకు, బొప్పాయి పంటలతో పాటు అంతర్ పంటగా టమాట, బెండకాయ, చిక్కుడు బీన్స్ వంటి కూరగాయలను సాగు చేస్తున్నాం. 2018లో ఇదే ప్రాజెక్టుకు 5 ఎకరాల భూమిని తీసుకున్నారు.

ఈ భూములు పోతే ఆత్మహత్యలే.. : టి.నర్సింలు

ఉన్న కొద్ది భూమిలో ఆలుగడ్డ, అల్లం, పసుపు వంటి పంటలను సాగు చేస్తూ బతుకుతున్నాము. ముందుగాల్నే పరిశ్రమల పేరుతో ఎకరా భూమిని తీసుకున్నారు. మళీ ఉన్న 0.20 ఎకరం భూమిని సైతం తీసుకుంటే ఎలా జీవించేది. భూమిని కోల్పోతే మాకు ఆత్మహత్యే దిక్కు.

చెరుకు పంట సాగు చేస్తున్నాం.. : మొల్ల అమీదా

రెండెకరాల్లో చెరుకు పంట సాగు చేస్తున్నాం. బ్యాంకులో పంట రుణం తీసుకుని నాలుగు బర్రెలు కొనుక్కున్నాం. అంతర్ పంటలుగా వంకాయ, టమాట, బెండ వంటి కూరగాయలు వేస్తున్నాం. ఇలాంటి భూములను కోల్పోతే ఎట్టా బతకాలి? ప్రభుత్వమిచ్చే రూ.15 లక్షలతో మా గ్రామంలోనే ఒక ప్లాట్ కూడా రావడం లేదు.

నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి : టి.వెంకటేశం

పరిశ్రమలు పెడతామని గతంలోనే 1.30 ఎకరాలను తీసుకుంది. అక్కడ ఇప్పటివరకు ఒక్క పరిశ్రమ కూడా నెలకొల్పలేదు. రెండు సంవత్సరాలు తిరగకముందే మళ్లీ నోటిఫికేషన్ వేసి భూసేకరణ చేపడతామని చెబుతున్నారు. బలవంతంగా భూమిని సేకరిస్తే మేమంతా రోడ్డున పడాల్సి వస్తుంది. ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి.

కళాత్మక ఫొటోలే చిరస్థాయిగా నిలుస్తాయి

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సందర్భాన్ని కండ్లకు కట్టే కళాత్మక ఫొటోలే చిరస్థాయిగా నిలుస్తాయని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ సంఘం (టిఎస్‌పిజెఎ) ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి న్యూస్ ఫొటో కాంటెస్ట్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోటోలను కళాత్మకంగా బంధించడం అంత సులభం కాదనీ, దానికి ఎంతో నైపుణ్యం కావాలన్నారు. అలాంటి క్లిష్టతరమైన వృత్తిలో రాణిస్తూ విలక్షణమైన ఫొటోలను ప్రపంచానికి అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థి సంఘ నాయకుడిగా, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యక్షంగా తాను ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నా. ఆ ఫొటోలు చూస్తుంటే గతం గుర్తొసోంది" అని పొన్నం పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి సానుకూలంగా ఉన్నారని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, విరాహత్ అలీ, తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కెఎన్ హరి, ఉపాధ్యక్షులు రామ్మూర్తి, సీనియర్ ఫొటో గ్రాఫర్లు ఎం.వెంకట అప్పారావు, వసంత్, అలీముద్దీన్, జాన్, మోహన్, జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటకు రోజుకు రెండు గంటల పాటు మంజీరా నీరు

- టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సదాశివపేట మున్సిపాలిటీ ప్రజలకు రోజుకు రెండు గంటల పాటు మంజీరా నీరు సరఫరా చేయాల్సిందేనని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదాశివ పేట మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంజీరా నీటి సరఫరా కోసం రూ.200 కోట్లు అవసరం అయినా సరే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగి నిధులు తీసుకువస్తానని తెలిపారు. మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా ఫిల్టర్ కావడం లేదనీ, సరిగ్గా రావడం లేదని తెలిపారు. జనాభా పెరగడంతో మున్సిపాల్టీకి చాలినంత నీళ్ల కోసం ప్రతి రోజు ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు ప్రెషర్ తో సరఫరా చేయాల్సిన అవసరముందని సూచించారు. ఏటిగడ్డ సంగం వద్ద ఫిల్టర్ బెడ్‌ను, సదాశివపేట శివారులో ఇంటెక్‌వెల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏటిగడ్డ సంగం బదులు నేరుగా సింగూర్ నుంచి నీటిని తరలిస్తే ఉపయోగం ఉంటుందని అధికారులు చేసిన సూచనతో అందుకనుగుణంగా ప్రణాళిక చేయాలని వారికి జగ్గారెడ్డి సూచించారు. మున్సిపాల్టీలో మొత్తం 11 ట్యాంకులు నిర్మించాలని జగ్గారెడ్డికి అధికారులు తెలిపారు. ఒక ప్రయివేటు కన్సల్టెన్సీని ఏర్పాటు చేయాలని, దానికయ్యే ఖర్చును తాను భరిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. అవసరమైన చోట పాత ట్యాంక్ లు, డిస్ట్రిబ్యూషన్ లైన్ల స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రజావాణి ప్రజల సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం ప్రజావాణిలో ప్రజలకు సంబంధించిన పలు సమస్యలను అక్కడి బాధ్యులు పరిష్కరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 386 దరఖాస్తులు అందాయి. వీటిని సిఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ స్వీకరించారు. వారు ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. దరఖాస్తుల్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76, రెవెన్యూ శాఖకు సంబంధించి 35, ప్రవాసి ప్రజావాణికి 02, విద్యుత్ శాఖకు 29, ఇందిరమ్మ ఇళ్ల కోసం 169 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 75 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్

ప్రభుత్వోద్యోగుల జంగ్‌సైరన్

- అక్టోబర్ 12న చలో హైదరాబాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తెలంగాణ ఉద్యోగ జెఎసి జంగ్‌సైరన్ మోగించింది. దానిలో భాగంగా అక్టోబర్ 12న లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులతో చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. వచ్చేనెల ఎనిమిది నుంచి 18 వరకు జిల్లాస్థాయి చైతన్య సదస్సులు నిర్వహించి ఉద్యోగులను సమాయత్తం చేసేందుకు బస్సుయాత్ర చేపడతామని ప్రకటించింది. తమ డిమాండ్ల సాధన కోసం 20 నెలలు ఎదురుచూశామనీ, ఇక ఓపిక పట్టే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం తప్ప తమముందు మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఉద్యోగ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

రంగస్థల ప్రముఖుడు డాక్టర్ పివి రమణ స్మారక పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - కల్చరల్

ప్రముఖ నాటక రచయిత డాక్టర్ పివి రమణ జయంతి కార్యక్రమాన్ని తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ వర్శిటీలోని ఎన్‌టిఆర్ కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పివి రమణ పేరిట స్మారక పురస్కారాన్ని 2024 సంవత్సరానికిగాను రంగస్థల కళలలో నిష్ణాతులైన సాంకేతిక రంగానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు డా॥ టి రాజబాబుకు, 2025 సంవత్సరానికిగాను ప్రముఖ రంగస్థల నటి, దర్శకురాలు సురభి ఆర్ పద్మజావర్మలకు పురస్కారాలను విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవి రమణ బాల్యదశలోనే నటుడిగా రంగస్థలానికి పరిచయమై జీవిత పర్యంతం నాటకానికి అంకితమైన గొప్ప నాటక, కథారచయితనీ, పివి రమణ పాశ్చాత్య, ద్రవిడ నాటకాల మీద పట్టును కలిగి అత్యల్ప పదాలతో విశేషార్థాన్నిచ్చే సంభాషణలతో 18 గొప్ప నాటకాలను రచించారని అన్నారు. రంగస్థలం మీద తప్ప ఏనాడూ నిజజీవితంలో నాటకాలు వేయలేదని, నాటకాలపై అపారమైన ప్రేమానురాగాలు కలిగిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన కేంద్రప్రముఖ రంగస్థల దర్శకులు బిఎం రెడ్డి మాట్లాడుతూ పివి రమణతో గల ప్రత్యక్ష అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు మాట్లాడుతూ పి.వి.రమణ గొప్ప అధ్యాపకుడని ఆయన విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన లేనిచో ప్రాయోగిక అంశాల పట్ల పట్టు ఉండదని అనేమార్లు చెప్పేవారని అన్నారు. ఈ కార్యక్రమానికి రంగస్థల కళల శాఖాధిపతి డా. బిహెచ్.పద్మప్రియ సమన్వయకర్తగా వ్యవహరించారు.

అమెరికన్ పకాన్‌తో కలిసి మస్కట్ కొత్త ఉత్పత్తులు

హైదరాబాద్ : నగర కేంద్రంగా పని చేస్తోన్న మస్కట్ డైరీ ప్రొడక్ట్స్ కొత్తగా అమెరికన్ పకాన్‌లతో కలిసి కొత్త వేసవి రుచులను పరిచయం చేసినట్లు పేర్కొంది. ప్రీమియం డెజర్ట్‌లు, స్నాక్స్‌లో పకాన్‌ల రుచిని ఆశ్వాదించవచ్చని ఆ కంపెనీ ఖాలిద్ మస్కట్ తెలిపారు. పకాన్‌ల నోరూరించే ఫ్రోజెన్ ట్రీట్స్, డ్రింక్స్ నుండి రుచికరమైన ఆవిష్కరణల వరకు అందుబాటులోకి రానున్నాయన్నారు.

మ్యాటర్ ఛార్జ్ నెట్‌వర్క్ విస్తరణ

హైదరాబాద్ : విద్యుత్ వాహనాల కంపెనీ మ్యాటర్ దేశ వ్యాప్తంగా రైట్ టు ఛార్జింగ్' పేరుతో తమ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపింది. ప్రతీ ద్విచక్ర వాహన పార్కింగ్‌లో స్లో, ఫాస్ట్ ఛార్జింగ్ హబ్‌లను ఏర్పాటు చేసే ప్రణాళికలను రూపొందించామని ఆ కంపెనీ సిఇఒ మహల్ లాల్ భాయి తెలిపారు. మ్యాటర్ ఎరాతో 90 నిమిషాల్లో 0-80 శాతం ఛార్జింగ్ సౌలభ్యాన్ని కల్పిస్తున్నామన్నారు. తమ రైట్ టు ఛార్జింగ్' ఉద్యమం రైడర్లకు కాలుష్యరహిత రవాణా స్వేచ్ఛను, సులభమైన ఛార్జింగ్ సేవలను అందిస్తుందన్నారు.

ప్రపంచానికి ప్రతిభావంతులను అందించిన ఒయు

- గౌరవ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ
- ఘనంగా ఒయు 84వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికే కాదు.. ప్రపంచానికే ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిభావంతులను అందించిందని యూనివర్సిటీ గౌరవ ఛాన్సలర్, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవం మంగళవారం ఠాగూర్ ఆడిటోరియంలో జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చైర్మన్ డాక్టర్ నారాయణన్, ఒయు విసి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం హాజరై విద్యార్థులకు పట్టాలు, బంగారు పతకాలను ప్రదానం చేశారు. పలు విభాగాల్లో పిహెచ్‌డి పూర్తి చేసిన 1261 మంది పరిశోధకులు పట్టాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మెన్‌కు గవర్నర్ ఒయు గౌరవ డాక్టరేట్ (డాక్టరేట్ ఆఫ్ సైన్స్) అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. ఓయూను విజ్ఞానం, పరిశోధనలు సహా విభిన్న రంగాల్లో నైపుణ్యాలకు నెలవుగా అభివర్ణించారు. ప్రపంచ వ్యాప్తంగా ఓయూ అల్యూమ్నీ అత్యంత దృఢంగా ఉందని, విస్తృత ప్రపంచంలో ఉస్మానియన్లుగా ప్రస్తుతం టార్చ్ బేరర్లుగా ఉన్నారని ప్రశంసించారు. విద్యార్థులు సమాజాభివృద్ధికి తమ జ్ఞానాన్ని

వినియోగించాలని సూచించారు.

ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ.. 108 ఏళ్ల చారిత్రక నేపథ్యం కలిగిన ప్రతిష్టాత్మక ఓయూ నుంచి గౌరవ డాక్టరేట్ స్వీకరించటం అత్యంత గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఈ డాక్టరేట్ మొత్తం ఇస్రోలో పనిచేస్తున్న 20 వేల మంది కృషి ఫలితమని, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు. నిరంతర పరిశోధనలు, అధ్యయనంతోనే విద్యార్థులు ఎంచుకున్న వృత్తుల్లో ఉన్నత అవకాశాలు సాధ్యమన్నారు. ప్రస్తుతం ఇస్రో విజయాల ముందు ప్రపంచం నివ్వెరపోతోందని, ఇందుకు ఇటీవలి విజయాలే సాక్ష్యమని అన్నారు. ఒకే రాకెట్ ద్వారా 106 శాటిలైట్లను పంపిన ఘనత సహా ఇస్రో సాధించిన ప్రతి విజయం వెనుక బృంద స్ఫూర్తి ఉందని వివరించారు. ఆపరేషన్ సింధూర్‌లో దేశ సైనిక అవసరాలకు ఖచ్చితత్వమైన సమాచారాన్ని ఇస్రో అందించిందన్నారు. టీమ్ వర్క్‌తో ఏదైనా సాధ్యమేనని, ఉస్మానియన్స్ సాధిస్తున్న విజయాలను అభినందించారు.

వర్సిటీ నివేదికను ఒయు విసి ప్రవేశపెట్టారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు, ఎన్ఐఆర్ఎఫ్ 2024 ర్యాంకింగ్, ఒయుకు దక్కిన గౌరవాన్ని వివరించారు. 2025లో క్యూఎస్ దక్షిణ ఆసియాలో 131 ర్యాంకు దక్కించుకున్నామని చెప్పారు. ఇటీవల "ప్రతిష్టాత్మక ఏస్ అవార్డు 2025" సాధించామన్నారు. ప్రస్తుతం ఒయులో 64 శాతం విద్యార్థినులు ఉన్నారని, ఇది మహిళా సాధికారతకు సూచికగా అభివర్ణించారు. దేశంలోనే తొలిసారిగా ఒక రాష్ట్ర విశ్వవిద్యాలయం స్వదేశీ పరిజ్ఞానంతో సెమి కండక్టర్ చిప్ అభివృద్ధి చేసి సత్తా చాటిందన్నారు. ఓయూ చరిత్రలో మొట్టమొదటిసారిగా గిరిజన విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఆంగ్లంలో అత్యుత్తమ పిహెచ్‌డి డిగ్రీని డాక్టర్ కొర్ర పాలెంకోకు అందజేశారు.

తన తండ్రి ప్రొఫెసర్ సముద్రాల సత్యనారాయణమూర్తి స్మారక బంగారు పతకాన్ని ఎంబిఎ ఫైనాన్స్‌లో డాక్టర్ చిన్నారికి ఐఎఎస్ అధికారి, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన అందజేశారు. స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ ఆచార్య జి నరేష్ రెడ్డి, ఓఎస్‌డి ఆచార్య జితేందర్ కుమార్‌నాయక్, 12 ఫ్యాకల్టీల డీన్స్ అధికారులు, గోల్డ్ మెడలిస్టులు, పట్టభద్రులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ సీనియర్ నేత వెంకట్‌రెడ్డి సతీమణి మృతి

- స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి
- సిపిఎం నేతలు, కవి గోరటి వెంకన్న, నివాళులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టు పార్టీ నాయకులు, టిఎస్‌యుటిఎఫ్ సీనియర్ నేత, కీర్తిశేషులు వెంకట్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లో మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని ఉదయమే నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాలకు తీసుకురాగా, సిపిఎం నేతలు, కవి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, నవతెలంగాణ సంస్థ సిబ్బంది నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామ ప్రజల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు. వెంకట్‌రెడ్డి ఆరేండ్ల కిందటే చనిపోయారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉద్యమ నిర్మాణంలో వెంకట్‌రెడ్డి-విజయలక్ష్మి పాత్ర మరువలేనిది. విజయలక్ష్మికి ముగ్గురు సంతానం సుమలత, సునిత, రాజు ఉన్నారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఐద్వాతోపాటు పార్టీ నిర్మాణంలో భర్తకు ఆమె సహకారమందించారు. విజయలక్ష్మి ఐద్వా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యక్షులుగా పని చేశారు. లలితమ్మ, భారతమ్మ, సత్తమ్మతో కలిసి ఐద్వా ఉద్యమంలో చురుకుగా పని చేశారు. తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన అంబలి కేంద్రాల నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. సిపిఎం, ప్రజాసంఘాల శిక్షణా తరగతులు, సెమినార్లు కూడా వారి ఇంట్లోనే నిర్వహించేవారు. ఆ సమయంలో కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకునేవారు. ఆమె చిన్న కుమార్తె సునీత ప్రస్తుతం నవతెలంగాణ దినపత్రికలో పనిచేస్తున్నారు. విజయలక్ష్మి మృతి పార్టీకి తీరని లోటని నాయకులు నివాళులర్పించారు. విజయలక్ష్మి మరణం పట్ల సిపిఎం నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు. అంతిమయాత్రలో ప్రముఖ కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సిపిఎం మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎ రాములు, కమ్యూనిస్టు సీనియర్ నాయకులు ఆర్.రామ్‌రెడ్డి, అబ్దుల్లాఖాన్, నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి పర్వతాలు, నవతెలంగాణ మొఫసిల్ ఇన్‌చార్జి వేణుమాధవ్, బోర్డు సభ్యులు తదితరులు ఆమె భౌతికకాయానికి నివాలులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

కాంగ్రెస్‌ను అభాసుపాలు చేసేందుకు కుట్ర

- యూరియా రాష్ట్ర వాటాను తక్షణం విడుదల చేయాలి : మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకే రాష్ట్ర వాటాగా రావాల్సిన యూరియాను బిజెపి, బిఆర్‌ఎస్‌లు కుట్రపూరితంగా అడ్డుకుంటున్నాయని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత ఆధ్వర్యంలో తాండూరుకు చెందిన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి హస్తం కండువాలు కప్పి మహేశ్ కుమార్ గౌడ్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా వాటాను తక్షణమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో నిద్రపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదంటూ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను హెచ్చరించారు. ఇప్పటికే యూరియా వాటా కోసం సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖలు రాశారని గుర్తుచేశారు. రాజకీయంగా కాంగ్రెస్ ను అప్రతిష్టపాలు చేసేందుకు యూరియా వాటాను ఆపడం ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మట్లాడుతూ బిఆర్ఎస్ మాజీ సర్పంచ్‌తో సహా వందలాది మంది నాయకులు కాంగ్రెస్ చేరినట్టు తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి చూసి పార్టీల చేరుతున్నారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యమంటే సంక్షేమ రాజ్యమని ప్రజలు భావిస్తున్నట్టు తెలిపారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రేషన్ కార్డులు రాక ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు వారంతా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని చెప్పారు. అర్హులైన వారందరికి పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభం చేయబోతున్నట్టు తెలిపారు.

మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన పౌర హక్కుల సంఘం నేతలు గాంధీభవన్‌లో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక బహిరంగ సభ కరపత్రాన్ని పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ కు పౌర హక్కుల సంఘం అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ ,నారాయణ రావు, ఆజాద్, చంద్రమౌళి అందజేశారు. ఆపరేషన్ కగార్ హత్యాకాండ - కాల్పుల విరమణ పేరుతో ఈ నెల 24 వ తేదీన వరంగల్‌లో బహిరంగ సభ జరుగబోతున్నది.

కెబిసిలో భీమ్ పేమెంట్స్ గోల్డెన్ వీక్

హైదరాబాద్ : పేమెంట్ టెక్ కంపెనీ భీమ్ పేమెంట్స్ యాప్ తాజాగా సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌తో కలిసి కెబిసిలో ప్రత్యేక 'గోల్డెన్ వీక్'ను ప్రకటించింది. సెప్టెంబర్ 1 నుండి అక్టోబర్ 10, 2025 వరకు భీమ్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న 10 మంది యూజర్లు అమితాబ్ బచ్చన్‌తో కౌన్ బనేగా కరోడ్‌పతి (కెబిసి) సెట్‌లో ఫాస్టెస్ట్ ఫింగర్ ఫస్ట్ రౌండ్‌లో పాల్గొనే అవకాశం పొందుతారని పేర్కొంది.

రూ.1200 కోట్లకు చేరిన అర్థా వెంచర్స్ ఎయుఎం

ముంబయి : ఆర్థా ఇండియా వెంచర్స్ తన ఆర్థా సెలెక్ట్ ఫండ్‌ను రూ.432 కోట్లతో ముగించినట్లు పేర్కొంది. ఇది తమ రూ.330 కోట్ల లక్ష్యం కంటే 131 శాతం ఎక్కువని పేర్కొంది. ఈ ఫండ్ భారత్‌లోని సిరీస్ ఎ,సి మధ్య నిధుల కొరతను తీరుస్తుందని ఆర్థా సెలెక్ట్ ఫండ్ మేనేజింగ్ పార్టనర్ అనిరుద్ ఎ దమానీ తెలిపారు. సంస్థ మొత్తం ఎయుఎం రూ.1,200 కోట్లను దాటిందన్నారు. ఈ ఫండ్ 135 పైగా పోర్ట్‌ఫోలియో కంపెనీలలో టాప్ 15 శాతం సిరీస్ బి, సి రౌండ్లలో రూ.20 కోట్ల చొప్పున 12-14 స్టార్టప్‌లలో పెట్టుబడి వ్యయాలను చేశామన్నారు.

ఆర్ఇఎస్ఎల్ హరిత కార్యక్రమాలు ఏర్పాటు

హైదరాబాద్ : నగరంలోని రీ సస్టైనబిలిటీ లిమిటెడ్ (ఆర్ఇఎస్ఎల్) పండుగ సీజన్‌ను పురస్కరించుకుని రెండు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపింది. 92.7 బిగ్ ఎఫ్ఎం పురస్కరించుకుని తమ అవార్డు గెలుచుకున్న గ్రీన్ గణేశ కార్యక్రమాన్ని 18వ ఎడిషన్ తమ స్మార్ట్ యాప్ ఆధారిత వ్యర్థ సేకరణ వేదిక, ఆక్రీ పవర్డ్ బై రీ సస్టైనబిలిటీ పరిచయం చేసినట్లు తెలిపింది. ఆర్ఇఎస్ఎల్ ప్రారంభించిన గ్రీన్ గణేశ, ఆక్రి కార్యక్రమాలకు నటుడు తనికెళ్ల భరణి, నటి మధుశాలిని, సిఇఒ మసూద్ మల్లిక్, 92.7 బిగ్ ఎఫ్ఎం సిఇఒ సునీల్ కుమారన్, మై హోమ్ భుజ నివాసులు హాజరయ్యారు. గ్రీన్ గణేశ, అక్రి ద్వారా స్థిరమైన జీవనాన్ని ప్రోత్సహించడం మా లక్ష్యమని ఆర్ఇఎస్ఎల్ మసూద్ మల్లిక పేర్కొన్నారు.

ఎన్‌సిఇఆర్‌టితో యుఎడ్యుకేట్ ఒప్పందం

హైదరాబాద్ : జాతీయ పాఠ్యాంశాలను క్యాట్‌బుక్ రూపంలో డిజిటల్ చేసేందుకు ఎన్‌సిఇఆర్‌టితో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు యుఎడ్యుకేట్ సంస్థ పేర్కొంది. ఇది డిజిటల్ ఇండియా లక్ష్యాలతో విద్యను సమగ్రంగా సాంకేతిక ఆధారితంగా అందుబాటులోకి మారుస్తుందని పేర్కొంది.. క్యాట్‌బుక్‌లు వీడియోలు, యానిమేషన్లు, ఆఫ్‌లైన్ యాక్సెస్‌తో 25 కోట్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చనుందని యుఎడ్యుకేట్ డైరెక్టర్ శరత్ కకుమాను పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం సమగ్ర, బహుభాషా విద్యను అందించి, దేశవ్యాప్తంగా నాణ్యమైన చదువును అందించడానికి దోహదం చేయనుందని ఎన్‌సిఇఆర్‌టి కార్యదర్శి అమన్ శర్మ తెలిపారు.

104 ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలి

- కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలి : టియుఎంహెచ్ఇయు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

104 ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలని, కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు-సిఐటియు అనుబంధం) కోరింది. ఈ మేరకు ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో 10 జిల్లాల నుంచి 104 ఉద్యోగులు మంగళవారం హైదరాబాద్‌లలోని ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ రెడ్డికి ప్రజావాణి ద్వారా వినతిపత్రాన్ని నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌కు అందజేశారు. గత ఐదు నెలలుగా వేతనాలు లేక, కంటిన్యూయేషన్ చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 1,091 మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల 710 మందికి మాత్రమే కంటిన్యూయేషన్ ఇచ్చిందనీ, మిగిలిన వారికి కూడా ఇవ్వాలని కోరారు. దీనిపై నోడల్ అధికారి దివ్య మాట్లాడుతూ కుటుంబ సంక్షేమ కమిషనర్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శితో మాట్లాడి వేతనాలు ఇప్పించడానికి, మిగిలిన వారికి కొనసాగింపు ఇవ్వడానికి ప్రయత్నిస్తానని హామి ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి విజయవర్ధన్ రాజు, రాష్ట్ర కార్యదర్శి నవీన్, పది జిల్లాల నుండి 104 ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.